
చెక్కులు అందుకున్న లబ్ధిదారుల కుటుంబసభ్యులతో ఎమ్మెల్యే గాంధీ

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

**హైదర్‌నగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** శేరిలింగంపల్లికి చెందిన పలువురికి వైద్యచికిత్సల కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా 70 మంది లబ్ధిదారులకి రూ.24 లక్షల నిధులు మంజూరయ్యాయి. శుక్రవారం ఎమ్మెల్యే గాంధీ తన కార్యాలయంలో బాధిత కుటుంబసభ్యులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం సహాయనిధి పేద ప్రజలకు గొప్ప వరమన్నారు. అనారోగ్యానికి గురై ఆర్థిక స్థోమత లేక ఆస్పత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ భరోసా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, రాజేందర్, బ్రిక్ శ్రీనివాస్, శ్రీనివాస్, జిల్లా గణేష్, కాశినాథ్‌యాదవ్, అనిల్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌చౌదరి, జోగిపేట పాల్గొన్నారు.

● **మియాపూర్:** భారతినగర్ డివిజన్ ఎంఐజీ కాలనీలోని రేణుక ఎల్లమ్మతల్లి దేవాలయం విస్తరణ పనులకు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ రూ.లక్ష, కార్పొరేటర్ సింధురెడ్డి రూ.50 వేలు విరాళంగా అందజేశారు.

## సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్

**హైదర్‌నగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** ఆల్విన్‌కాలనీ డివిజన్ తులసినగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా సీసీరోడ్ల నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అనంతరం కాలనీ వాసులతో మాట్లాడి స్థానికంగా సమస్య తెలుసుకున్నారు. ప్రాధాన్యత క్రమంలో అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, సిహెచ్ భాస్కర్, యాదగిరి, సంగమేష్, మల్లేష్‌గౌడ్, రమేష్, జనార్దన్, నవీన్‌రెడ్డి, గుప్త, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రవికుమార్, కాలనీ వాసులు పాల్గొన్నారు.


సీసీరోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

## బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శిగా కేశవ్‌యాదవ్


నియామకపత్రం అందుకుంటున్న కేశవ్‌యాదవ్

**జీడిమెట్ల, జూలై 26(ఆంధ్రజ్యోతి):** బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శిగా న్యాయవాది కేశవ్‌యాదవ్ శుక్రవారం నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈసందర్భంగా కేశవ్‌యాదవ్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బక్క శంకర్‌రెడ్డి, శ్రీనివాస్, పత్తిరఘుపతి, డివిజన్ అధ్యక్షుడు పులిబలరాం, పత్తిసతీష్, సాయినాథ్‌నేత, పరుషవేణు పాల్గొన్నారు.


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జగదీశ్వర్‌గౌడ్, నాయకులు

## నగరాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది

**గచ్చిబౌలి, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ 2024లో నగరాభివృద్ధికి నిధులు కేటాయించడం అభినందనీయమని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం నల్లగండ్లలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరాభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు.

## పటాన్‌చెరు డివిజన్‌ను అభివృద్ధి చేయాలి

**గచ్చిబౌలి, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** పటాన్‌చెరు డివిజన్‌లోని కాలనీల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని హెచ్‌ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ ఎండీ అశోక్‌రెడ్డిని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. వివిధ కాలనీల్లో అంతర్గత డ్రైనేజీలైన్లు, నూతన పైపులైన్లు, రోడ్ల పునరుద్ధరణ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**ఫతేనగర్, జూలై 26(ఆంధ్రజ్యోతి):** పోస్టల్ శాఖ అందిస్తున్న సేవలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ డివిజన్ ప్రజలకు సూచించారు. శుక్రవారం రెండు రోజుల డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (డీసీడీపీ)లో భాగంగా భగత్‌సింగ్ పార్కులో సనత్‌నగర్ పోస్టాఫీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పోస్టల్ శాఖ సూపరెంటెండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ.. తమ సంస్థ ద్వారా పోస్టల్ ఖాతాలు, ఇన్సూరెన్స్‌లు, పోస్టల్ బ్యాంకింగ్, యాక్సిడెంట్ ఇన్సూరెన్స్, గంగాజల్ లాంటి సేవలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ నాయక్, ఎస్‌పీఎం గోవిందరావు, ఫతేనగర్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు శిల్ప పాల్గొన్నారు.

## బోనాల వేడుకలకు ఆలయాలు ముస్తాబు

**బాలానగర్, జూలై 26(ఆంధ్రజ్యోలి):** ఆదివారం జరిగే ఆషాఢమాస బోనాలకు అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఇప్పటికే ఆలయాలకు పెయింటింగ్ వేసి రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. అమ్మవారి ఆలయాల వద్ద బోనాల భక్తి గీతాలతో సందడిగా మారింది. బోనాలతో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

## వ్యక్తి మృతదేహం లభ్యం

**అల్లాపూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్‌లో గురువారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహం ఓ ఆటోలో ఉందని, ఎర్రరంగు షర్టు, నీలం రంగు జీన్స్ ప్యాంటు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వయసు 40 - 45 మధ్యన ఉండొచ్చని అంచనా. అనంతరం జరిపిన విచారణలో ఆ వ్యక్తి ఎవరన్న విషయం తెలియనదన్నారు.


లభ్యమైన మృతదేహం

## కుటుంబ సమస్యలతో నవవధువు ఆత్మహత్య

**హైదర్‌నగర్, జూలై 26(ఆంధ్రజ్యోతి):** కుటుంబ సమస్యలతో మానసిక ఒత్తిడికి గురై ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా చేజార్ల మండలం కొలపనైదుపల్లి గ్రామానికి చెందిన శ్రీధర్ మార్చిలో హేమానందిని(27)ని వివాహం చేసుకొని కేపీహెచ్‌బీ కాలనీ ఫేజ్-7లో నివాసం ఉంటున్నారు.

దంపతులిద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పని చేస్తుండగా వీరికి తోడుగా రెండు నెలల నుంచి హేమనందిని సోదరుడు హరిబాబు సైతం నివసిస్తున్నాడు. ఆషాఢ మాసం మొదలు కావడంతో శ్రీధర్ తన సొంత గ్రామానికి వెళ్లడంతో హరిబాబు, హేమనందినిలకు తోడుగా వాళ్ల అమ్మమ్మ కలిసి ఉంటుంది. బుధవారం రాత్రి ముగ్గురు కలిసి భోజనం చేసి పడుకున్నాక, హేమనందిని గుర్తు తెలియని ద్రవం తాగడంతో ఆమెకు ఊపిరి పీల్చుకోవడం ఇబ్బందిగా మారింది. చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. కాగా ఆమె చికిత్స పొందుతు మృతిచెందింది. శుక్రవారం పోలీసులకు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. మృతురాలు వ్యాస్మోల్ కేష్‌కాలా తాగి ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలు కుటుంబసభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

# నాలాల్లోకి వ్యర్థ రసాయనాలు

- ఘాటైన వాసనలతో ఉక్కిరిబిక్కిరవుతున్న బాలానగర్ ప్రజలు
- సమాచారం ఇచ్చినా పట్టించుకోని పీసీబీ
- ఆస్పత్రుల పాలవుతున్న స్థానికులు

**బాలానగర్, జూలై 26(ఆంధ్రజ్యోతి):** వర్షాల చాటున బాలానగర్‌లోని మురుగునీటి నాలాల్లో వ్యర్థ రసాయనాలను పారిస్తున్నారు పలు రసాయన పరిశ్రమల యాజమాన్యాలు. మూడు, నాలుగు రోజుల నుంచి నాలాల్లోంచి వెలువడుతున్న ఘాటైన వాసనలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీడిమెట్ల సుభాష్‌నగర్ నుంచి బాలానగర్ వినాయకనగర్, సాయినగర్, కల్యాణ్‌నగర్, నవజీవన్‌నగర్ బస్తీల మీదుగా పారుతున్న నాలాలో కొన్ని పరిశ్రమలు వ్యర్థ రసాయనాలను డంప్ చేస్తున్నాయి. దీంతో నాలా నీటి రంగు మారి పోయి ఘాటైన వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. వర్షాలు కురవక ముందు ఆదివారం, సెలవు రోజుల్లో మాత్రమే నాలా నుంచి ఘాటైన వాసనలు వచ్చేవని, వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఉదయం రాత్రి అనేది లేకుండా రోజంతా నాలాలో వ్యర్థ రసాయనాలు పారుతున్నాయన్నారు. రసాయనాల వాసనలు పీల్చడంతో వృద్ధులు, చిన్నారులు శ్వాస సంబంధ సమస్యలతో ఆస్పత్రుల పాలవుతున్నామని ఆందోళన చెందుతున్నారు. మరికొందరు చర్మ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొన్ని కంపెనీలు తమ వ్యర్థ రసాయనాలను అక్రమంగా నాలాల్లోకి వదులుతుండడంతో సమస్యలు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. వర్షం వచ్చిన ప్రతీసారి ఇదే సమస్య ఎదురవుతోందని పలు బస్తీలకు చెందిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలాలో కలుస్తున్న వ్యర్థ రసాయనాల గురించి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఫోన్ ద్వారా సమాచారం ఇస్తే ఎవరూ స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నాలాలో వ్యర్థ రసాయనాలు పారబోస్తున్న వారిని గుర్తించి వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.


నాలాలో పారుతున్న నలుపురంగు రసాయన వ్యర్థాలు

## 'కార్పొరేషన్ అభివృద్ధే ధ్యేయం'

**నిజాంపేట్, జూలై 26(ఆంధ్రజ్యోతి):** నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో నిర్మితమవుతున్న ఎస్‌ఎన్‌డీపీ నాలా నిర్మాణ పనులను, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కాలువలను పలువురు కార్పొరేటర్లతో కలిసి మేయర్ కొలన్ నీలారెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. కార్పొరేషన్ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని, వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు తుగ చర్యలు చేపడుతున్నామన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఇప్పటి వరకు రూ.90 కోట్ల వ్యయంతో చేపట్టిన ఎస్‌ఎన్‌డీపీ నాలా నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావచ్చాయన్నారు. ఎస్‌ఎన్‌డీపీ పనులు చేపట్టక ముందు వర్షం పడితే పరిస్థితులు ఇబ్బందిగా ఉండేవి. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవని, వర్షపు నీరు ఎక్కడా నిలువకుండా నాలా ద్వారా బయటకు వెళుతున్నాయన్నారు. మిగిలిన పనులు కూడా అతి త్వరలో పూర్తి కానున్నాయన్నారు. అదే విధంగా డ్రైనేజీ రోడ్డు ప్యాచ్‌వర్క్సు, వర్షపు నీరు తొలగింపు వంటి సమస్యలపై దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు అధికారుల సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆగం పాండు, సురేష్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు వీరేష్, నాయకులు వెంగయ్యచౌదరి, సాయి తదితరులు ఉన్నారు.

## విస్తరణకు నోచుకోని రహదారి

**పేట్‌బషీరాబాద్, జూలై 26(ఆంధ్రజ్యోతి):** సుచిత్ర నుంచి కుత్బుల్లాపూర్‌కు వెళ్లే ప్రధాన రహదారి విస్తరణకు నోచుకోకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు రోడ్డు మధ్యలో డివైడర్‌ను ఏర్పాటు చెయ్యడంతో రహదారి ఇరుకుగా మారింది. కుత్బుల్లాపూర్‌కు వెళ్లే మార్గంలోని హెచ్‌పీ గ్యాస్ బంక్ ఉంది. సీఎన్‌జీ నింపుకునేందుకు పెట్రోల్‌బంక్‌లోకి వెళ్లేందుకు ఆటోలు, కార్లు రోడ్డు పక్కన పొడవునా నిలుపుతున్నారు. దీంతో గణేష్‌నగర్, రాఘవేంద్రకాలనీ, గాయత్రినగర్, సుచిత్రా నుంచి వచ్చిపోయే వాహనాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ పెట్రోల్‌బంక్ సమీపంలోనే యూటర్న్ ఉండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. కాలేజీ, స్కూల్, ఉద్యోగాలకు వెళ్లే ప్రయాణికులు, స్థానికులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. బంక్‌కు వచ్చే వాహనాలను రహదారిపైన నిలుపకుండా చూడాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు త్వరగా చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


కుత్బుల్లాపూర్‌కు వెళ్లే మార్గంలో ఇరుకుగా ఉన్న రోడ్డు

## నేడు కమ్మ సంఘంలో ఉచి త వైద్యశిబిరం

**మియాపూర్:** మియాపూర్ ప్రగతి ఎన్‌క్లేవ్ సినీటౌన్ థియేటర్ రోడ్డులో ఆదివారం కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో కార్డియాక్, ఆర్థోపెడిక్, జనరల్ ఫిజిషియన్, గైనకాలజీ వైద్యులు ఉంటారని తెలిపారు.

## రోడ్లపై వర్షంనీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి

**గచ్చిబౌలి, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని రహదారులపై వర్షపునీరు నిలవకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని జోనల్‌కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. శుక్రవారం జోనల్ కార్యాలయంలోని బయోడైవర్సిటీ, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ.. వర్షపునీరు రోడ్లపై నిల్వకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు.

● శేరిలింగంపల్లి జోన్ పరిధిలో పరిసరాల పరిశుభ్రతతో పాటు పచ్చదనానికి పెద్దపీట వేయాలని జడ్సీ అన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న జడ్సీ ఉపేందర్‌రెడ్డి

### ● అభివృద్ధి పనులపై జడ్సీకి వినతి

**హైదర్‌నగర్:** కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అపూర్వచౌహాన్‌ను శుక్రవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి డివిజన్‌లోని సమస్యలపై వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లోని సమస్యలు, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

### సీఆర్‌ఎంపీ ఏజెన్సీ పని తీరుపై జడ్సీ సమీక్ష

**కేపీహెచ్‌బీకాలనీ:** కూకట్‌పల్లి జోన్‌లోని ఐదు సర్కిళ్ల పరిధిలో సీఆర్‌ఎంపీ పనితీరుపై జడ్సీ అపూర్వ చౌహాన్ శుక్రవారం జోనల్ కార్యాలయంలో ఎస్ఈ, ఈఈలు, డీఈలతో సమావేశం అయ్యారు. సీఆర్‌ఎంపీ పరిధిలోని గుంతలు, నీరు నిలిచిపోయే పాయింట్లు, ఫుట్‌పాత్ మరమ్మత్తులపై సంబంధిత ఏజెన్సీ నిర్వాహణ గురించి దిశానిర్దేశం చేశారు. జోన్ పరిధిలో 44 ప్రధాన రహదారులు సీఆర్‌ఎంపీ ఏజెన్సీ కింద ఉన్నాయన్నారు. ఆయా మార్గాల్లో ఏమైనా సమస్యలు ఉంటే 9676265050 సంప్రదించి సత్వరమే పరిష్కారం కనుగొనవచ్చని జడ్సీ పేర్కొన్నారు.

## జీవనవిధానమే అభివృద్ధికి కొలమానం

**జేఎన్టీయూ రెక్టార్ విజయకుమార్ రెడ్డి**

**హైదరాబాద్‌సిటీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** ప్రజల జీవన విధానమే దేశాభివృద్ధికి కొలమానమని జేఎన్‌టీయూ రెక్టార్ కె.విజయకుమార్‌రెడ్డి అన్నారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్ కె.ఎం.లక్ష్మణరావు పదవీవిరమణను పురస్కరించుకొని 'సుస్థిర అభివృద్ధిలో తెలివైన రవాణ వ్యవస్థల పాత్ర' అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రెక్టార్ మాట్లాడుతూ.. గ్రామాలకు, పట్టణాలకు మధ్య ఉత్తమ రహదారులు ప్రజల జీవన విధానం మెరుగవడానికి దోహదపడతాయన్నారు. ప్రొఫెసర్ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. దేశంలోని పలు జాతీయ రహదారి మార్గాల రూపకల్పనలో కీలకంగా వ్యవహరించారని కొనియాడారు. ప్రిన్సిపాల్ జి.వి.నర్సింహారెడ్డి మాట్లాడుతూ, ప్రొఫెసర్ లక్ష్మణ్‌రావు మూడు దశాబ్దాలకు పైగా విద్యార్థులకు విద్యాబోధన చేశారని, ఆయన వద్ద చదువుకున్న విద్యార్థులు నేడు దేశ వ్యాప్తంగా పలు కీలకపదవుల్లో కొనసాగుతున్నట్లుగా చెప్పారు. తక్కువ ఖర్చుతో రహదారుల నిర్మాణం, నిర్వహణ కార్యక్రమాల్లో లక్ష్మణరావు ఎనలేని సేవలందించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.పద్మావతి, సివిల్ విభాగం ఆచార్యులు జీకే విశ్వనాథ్, జనార్దన్ యాదవ్, జీవీఎస్ గిరిధర్, ఐఐఐటీహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ దిగ్విజయ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రొఫెసర్ లక్ష్మణరావును సత్కరిస్తున్న వర్సిటీ రెక్టార్, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్

## బ్రాహ్మణ పరిషత్‌కు నిధుల కేటాయింపుపై హర్షం

**జీడిమెట్ల, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** తెలంగాణా బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు 50 కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తూ ప్రభుత్వ నిర్ణయం తీసుకోవడం పట్ల గాయత్రి బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడు గోగుల పాటి కృష్ణమోహన్ కృతజ్ఞతలు తెలియచేశారు. సూరారంకాలనీలోని వాసుదేవ ఆశ్రమంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌ను నమ్ముకుని అప్పులు చేసి తమ పిల్లలను విదేశీ విద్య కోసమ విదేశాలకు పంపించి చేయుత కోసం ఎదురు చూస్తున్న కుటుంబాలకు, బెస్ట్ స్కీం కింద దరఖాస్తు చేసుకున్న కుటుంబాలకు 50కోట్ల రూపాయాలు కేటాయించడం వల్ల ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. తక్షణమే బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు చైర్మన్‌ను నియమించాలని కోరారు. ఈకార్యక్రమంలో సలహాదారుడు సర్వేపల్లి రమేష్‌కుమార్, గడ్డం రాంబాబు, హనుమంతరాయశర్మ, సుబ్రమణ్యస్వామి, సంహాచలం పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సంఘం సభ్యులు

## క్రికెట్ అభివృద్ధిలో జర్నలిస్టుల కృషి ఎనలేనిది

**ఏసీఏ మాజీ సీఏసీ చైర్మన్ సత్యప్రసాద్**

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి):** దేశంలో క్రికెట్‌కు ఈస్థాయిలో ఆదరణ లభించడానికి, క్రికెట్ ఇంతలా అభివృద్ధి కావడానికి జర్నలిస్టులు చేసిన కృషి ఎనలేనిదని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ మాజీ సీఏసీ చైర్మన్ సత్యప్రసాద్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం విజయానంద్ మైదానంలో జరిగిన కేఎస్‌సీ జర్నలిస్టు ప్రీమియర్ లీగ్ సెమీఫైనల్స్ ప్రారంభానికి సత్యప్రసాద్, లైఫ్‌స్పాన్ స్పోర్ట్స్ హెడ్ భరణి ముఖ్య అతిథిలుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక నైపుణ్యం గల ప్లేయర్‌ను పైకి తీసుకురావడంలో జర్నలిస్టులు పడే తాపత్రయం, శ్రద్ధను ప్రశంసించారు. అనంతరం టాస్ వేసి, ఇరు జట్ల ప్లేయర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఇక, తొలి సెమీఫైనల్లో ఎన్టీవీ రైజర్స్ జట్టుపై ఏబీఎన్-ఆంధ్రజ్యోతి టీమ్ 48 పరుగుల తేడాతో పోరాడి ఓడింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎన్టీవీ 20 ఓవర్లలో 155/7 స్కోరు చేసింది. ఛేదనలో ఆంధ్రజ్యోతి 20 ఓవర్లలో 107/9 మాత్రమే స్కోరు చేసి ఓటమి పాలైంది.


సురేష్‌ను అభినందిస్తున్న సత్యప్రసాద్

## 'మిస్టరీ ఆఫ్ ది మిస్సింగ్ జ్యువెల్స్' పుస్తకానికి ప్రశంసలు

**పుస్తక రచయిత ఐదవ తరగతి విద్యార్థి దైవిక్**

**హైదరాబాద్ సిటీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** పిల్లలకు, యువకులకు సెల్‌ఫోన్ ప్రపంచంగా మారిన ఈ రోజుల్లో 10 ఏళ్ల బాలుడు రాసిన కథల పుస్తకం పాఠకుల ఆదరణను సాధించింది. తెల్లాపూర్ మంథన్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న దైవిక్ పుస్తకాన్ని రచించాడు. అనగనగా ఒక రాజ్యం. ఆ రాజ్యం ఆభరణాలు తయారు చేయడంలో ప్రసిద్ధి చెందినది. ఒక దొంగ ఆభరణాలను దొంగిలిస్తాడు. ఆ ఆభరణాల మిస్టరీని యువరాజు ఎలా ఛేదించాడన్నదే "మిస్టరీ ఆఫ్ ది మిస్సింగ్ జ్యువెల్స్" కథ. ఈ పుస్తకం విడుదల అయినప్పటి నుంచి అనేక మంది పుస్తక ప్రియులు ప్రశంసలు కురిపిస్తున్నారు. యువ రచయిత ఇటీవల బ్రిబుక్స్ నుంచి ప్లాటినం రచయిత సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ పుస్తకం చాలా తక్కువ సమయంలో పాఠకుల ఆదరణ పొందింది. ఈ సందర్భంగా దైవిక్ మాట్లాడుతూ నాకు పుస్తకాలు చదవడం అంటే చాలా ఇష్టం. కల్పిత కథలపై ప్రత్యేక ఆసక్తి. మా అమ్మ నాలోని జిజ్ఞాసను గమనించి పుస్తకం రాయమని ప్రోత్సహించింది. గతంలో చదివిన కథల ప్రేరణతోనే ఈ కథను రాశాను. దైవిక్ తల్లి సౌజన్య మాట్లాడుతూ దైవిక్‌కు పౌరాణిక కథలంటే ఆసక్తి అని, ట్రేసీ వెస్ట్ థియా స్టిల్టన్ రచనలను అమితంగా ఇష్టపడతారని తెలిపారు. దైవిక్ ప్రయత్నాలకు మద్దతు ఇస్తున్న మంథన్ పాఠశాలకు కృతజ్ఞతలు తెలిపారు. దైవిక్ చదువుతోపాటు, క్రీడలలో ప్రతిభ చూపుతూ అనేక బహుమతులు గెలుచుకున్నాడని తెలిపారు.


పుస్తక రచయిత దైవిక్

## ఆరు గ్రాముల గంజాయి స్వాధీనం

**రాంనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** గంజాయి విక్రయిస్తున్న పాత నేరస్తుడిని నల్లకుంట పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి ఆరు గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సీఐ బి. జగదీశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. విద్యానగర్ రైల్వే స్టేషన్ వద్ద నివసిస్తున్న షేక్ మోసిన్(28) ఏసీ మెకానిక్. ఓ కేసులో జూలుకెళ్లి ఇటీవల విడుదలయ్యాడు. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో అడిక్‌మెట్ ప్లేగ్రౌండ్‌లో గంజాయి విక్రయిస్తున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ శ్రీనివాస్‌రావు సిబ్బందితో అక్కడికి చేరుకొని అతడిని అదుపులోకి తీసుకుని ఆరు గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

## సినారె సాహిత్యంపై లోతైన అధ్యయనం చేయాలి

**చిక్కడపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** డాక్టర్ సి. నారాయణరెడ్డి సాహిత్యంపై లోతైన అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ డా. ఆయాచితం శ్రీధర్ అన్నారు. ప్రముఖ మహిళా సంస్థ రాగరాగిణి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలో డా. సినారె జయంతి సభ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన సినారె సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ రచయిత్రి డా. సి. మృణాళినికి బహూకరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. మాటలు రాతల్లో పదును ఉండే మృణాళిని అపార విజ్ఞాన ఖని అని అన్నారు. అధ్యక్షత వహించిన దక్షిణ మధ్యరైల్వే పూర్వ జీఎం సి. రామకృష్ణ మాట్లాడుతూ.. పరిశోధకుడు తాళ్లపల్లి అనంతకృష్ణశర్మ వారసురాలిగా మృణాళిని సాహిత్యం, సంగీతం పరిశోధనలలో ప్రతిభాశాలి అని ప్రశంసించారు. కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, సంస్థ అధ్యక్షురాలు రమణకుమారి, ప్రధాన కార్యదర్శి సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రమణకుమారి బృందం సినారె గీతాలు మధురంగా ఆలపించారు.


మృణాళినికి సినారె సాహిత్య పురస్కారం అందజేస్తున్న డా.శ్రీధర్

## కారు తీయమన్నాడని వ్యక్తిపై కాంగ్రెస్ నాయకుడి దాడి

**అంబర్‌పేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** పార్క్ చేసిన కారు తీయమన్నందుకు ఓ వ్యక్తిపై కాంగ్రెస్ నేత దాడిచేశాడు. అంబర్‌పేట సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గోల్నాక శంకర్‌నగర్‌లో నివసిస్తున్న శ్రీనివాస్ నాయక్ తన కారును ప్రతి రోజూ ఇంటి ఎదుట పార్క్ చేస్తుంటాడు. గురువారం రాత్రి బయటకు వెళ్లి వచ్చే సరికి ఆ స్థలంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్ కారు పార్క్ చేసి ఉంది. కారు తీయమని శ్రీనివాస్ నాయక్ ఆయనకు చెప్పగా కోపోద్రిక్తుడైన కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ నాయక్‌పై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు శ్రీనివాస్ యాదవ్‌పై కేసు నమోదు చేశారు.

## ఇంట్లోనే భార్యాభర్తలు.. బీరువాకు తాళం

**అయినా 20 తులాల బంగారు నగలు, రూ.1.6 లక్షల నగదు మాయం**

**నిజాంపేట్, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** బాచుపల్లి పోలీస్‌స్టేషన్ నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలోని ఓ ఇంట్లో అనుమానాస్పద స్థితిలో భారీ చోరీ జరిగింది. 20 తులాల బంగారు ఆభరణాలు, 1 లక్షా 60 వేల రూపాయల నగదు చోరీకి గురయినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు శుక్రవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. బీరువాకు వేసిన తాళాలు వేసినట్టే ఉన్నాయని, ఇంటి వద్దనే భార్యాభర్తలు ఉన్నారు. బీరువా తాళాలు అక్కడే ఉన్నాయి. దొంగతనం ఏవిధంగా జరిగిందనే దానిపై పోలీసులు తర్జనభర్జన పడుతున్నారు. సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు వెంకట్రావు, విజయలక్ష్మీ భార్యాభర్తలు. భర్త వెంకట్రావు మేస్త్రీ పని చేస్తున్నాడు. నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలోనే సొంత ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నారు. భార్య విజయలక్ష్మీ ఇంటి వద్దనే ఉంటుంది. శుక్రవారం ఉదయం పనికి వెళ్లిన వెంకట్రావు మధ్యాహ్నం వచ్చి బీరువా తీసి చూడగా అందులో దాచిన 20 తులాల బంగారు నగలు, 1.6 లక్షల రూపాయల నగదు కనిపించ లేదు. ఈ విషయం భార్య విజయలక్ష్మీని అడిగగా.. తనకేమీ తెలియదని చెప్పడంతో బంగారం, డబ్బులు చోరీకి గురయ్యాయని బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందించడంతో సీఐ ఉపేందర్, క్రైమ్ ఎస్ఐ కోటిరెడ్డిలు ఇంటి వద్దకు చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. ఇంటి యజమానులు ఇంట్లో ఉండగా చోరీ ఏవిధంగా జరిగిందనే దానిపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఇంటిని పరిశీలిస్తున్న క్రైమ్ బ్రాంచ్ పోలీసులు